# వరాల జల్లుపై హర్షాతిరేకాలు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిడదవోలు పర్యటన విజయవంతం
- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు అడిగిన పనులన్నింటికీ పచ్చజెండా
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- జై జగన్ నినాదంతో మారుమోగిన పట్టణం



హెలిప్యాడ్ వద్ద నుంచి బస్సులో బహిరంగ సభా వేదిక వద్దకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై పూలవర్షం కురిపిస్తున్న అభిమానులు



అడుగో.. జగనన్న వస్తున్నాడు.. అంటూ పూల వర్షం కురిపించేందుకు సిద్ధం అవుతున్న కాపు మహిళలు

నిడదవోలు: అడిగింది కాదనకుండా ఇచ్చే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించారు. శనివారం నాటి సీఎం నిడదవోలు పర్యటనతో స్థానికులు, ప్రజాప్రతినిధులు ఊహించనంతగా నియోజకవర్గానికి మేలు జరగనుంది. స్థానిక ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడి అడిగిన పనులన్నింటికీ ముఖ్యమంత్రి పెద్ద మనసుతో ఆమోదం తెలిపారు. బహిరంగ సభా వేదికపై నుంచి ముఖ్యమంత్రి కురిపించిన వరాల జల్లుకు అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యమంత్రి నిడదవోలు పర్యటన విజయవంతమైంది. నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద నుంచి పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామం వరకూ వశిష్ఠ గోదావరి నది కుడి ఏటిగట్టు అభివృద్ధికి సీఎం పచ్చజెండా ఊపారు. ఈ ఏటిగట్టుపై ప్రస్తుతం ఉన్న కంకర రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తారు. ఇందుకు ఏకంగా రూ.66 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే 17 గ్రామాలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుంది. అంతేగాకుండా గోదావరి నదికి భారీ వరదలు సంభవించినా తీర ప్రాంత రైతులకు ఎలాంటి పంట నష్టం వాటిల్లదు.

**100 పడకలకు నిడదవోలు ఆసుపత్రి**

ఈ ప్రాంత రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న నిడదవోలు ప్రభుత్వాస్పత్రి స్థాయిని 100 పడకలకు పెంచుతున్నట్టు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం రూ.19 కోట్లు కేటాయిస్తున్నట్టు బహిరంగ సభ వేదికపై నుంచి ఆయన ప్రకటించారు. ఉండ్రాజవరం మండలంలో ప్రవహించే అత్తిలి కాలువపై వడ్లూరు గ్రామం వద్ద వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి అనుమతులు ఇచ్చారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే వడ్లూరు గ్రామం నుంచి ఆ గ్రామంలోని ఎస్సీ కాలనీకి సులభంగా రాకపోకలు సాగించవచ్చు. నిడదవోలు పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో అభివృద్ధి రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. అలాగే నిడదవోలులో ఆటోనగర్ అభివృద్ధికి అంగీకారం తెలిపారు. పట్టణానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బీసీ కమ్యూనిటీ, మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్లు, షాదీఖానాలు మంజూరు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో కూలిపోయిన బ్రిటిష్ కాలం నాటి వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి రూ.4.65 కోట్లు మంజూరు చేశారు.

**జగన్నినాథం.. జన సంద్రం**

ముఖ్యమంత్రి హోదాలో పట్టణానికి రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో తమ అభిమాన నాయకుడిని చూసేందుకు తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాల నుంచి భారీ ఎత్తున జనం తరలి వచ్చారు. తొలుత ముఖ్యమంత్రి స్విచ్ ఆన్ చేసి కాపు నేస్తం నాలుగో విడత నిధులను లబ్ధిదారుల ఖాతాలకు జమచేశారు. లబ్ధిదారులు, అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్ మైదానంలోని సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. లోపల స్థలం లేకపోవడంతో వేలాది మంది సభ ప్రాంగణం ముందు ఉన్న రోడ్డులో నిలబడి నిలుచుని సీఎం జగన్ ప్రసంగాన్ని విన్నారు. సభ ప్రారంభం నుంచి ముగిసే సభా ప్రాంగణం జగన్నినాదంతో మారుమోగింది. బహిరంగ సభ నేపథ్యంలో ట్రాఫిక్ ఎటువంటి అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. సభ విజయవంతం కావడంతో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కన్వీనర్ తలశిల రఘురాం ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, అయినీడి పల్లారావు, కార్చర్ల ప్రసాద్, నందిగాం భాస్కరరామయ్య, ముళ్ళపూడి శ్రీనివాస చౌదరి, వీరమల్లు సత్యనారాయణ, తిరుమళ్ళ భాగ్యలక్ష్మి, మద్దిపాటి ఫణీంద్ర, ఎస్‌కే వజీరుద్దీన్, పార్టీ శ్రేణులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

## అడుగడుగునా ఆత్మీయ స్వాగతం

నిడదవోలు రూరల్: నిడదవోలు విచ్చేసిన జననేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం అడుగడుగునా ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయన కోసం ఉదయం నుంచే దారి పొడవునా ప్రజలందరూ ఎదురు చేశారు. పట్టణ శివారులోని సుబ్బరాజుపేట హెలిప్యాడ్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షో ద్వారా బస్సులో సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్లోని సభా ప్రాంగణానికి వెళ్లే వరకూ నీరాజనాలు పలికారు. రోడ్డుకు ఇరువైపులా మహిళలు, యువత పూల వర్షం కురిపించారు. జై జగన్.. పొలిటికల్ సూపర్ స్టార్ జగనన్న అంటూ నినాదాలు చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో చిన్నారులతో కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సీఎం జగన్ రాకతో నిడదవోలులోని గణేష్ చౌక్, గణపతి సెంటర్, బస్టాండ్, రైల్వేస్టేషన్, సింగవరం వెళ్లే రోడ్లలో ఎటు చూసిన జన సందోహం కనిపించింది.



ముఖ్యమంత్రి జగన్‌ను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు



సభా ప్రాంగణం నిండిపోవడంతో బయట కూడా వేచి ఉన్న అశేష జన వాహిని



వేదికపై సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

## క్లుప్తంగా

### పల్లెల్లో వైరల్ జ్వరాలు

దేవరపల్లి: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పల్లెల్లో వైరల్ జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. జలుబు, వంటినొప్పులు, జ్వరం వంటి వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, అనంతరం ఉక్కబోత వాతావరణం వల్ల ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ఎక్కువగా టైఫాడ్ జ్వరాలు ఉన్నట్టు తెలిసింది. ప్రతి గ్రామంలో జ్వరపీడుతులు ఉన్నారు. వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### దాడులను అరికట్టాలంటూ బీఎస్పీ దీక్ష

పెరవలి: నిడదవోలు నియోజకవర్గంలో దళిత ఉద్యోగులపై సాగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో పెరవలిలో శనివారం ఒక రోజు నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బద్దా జాన్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కేటాయింపులో దళితులు నుంచి సొమ్ములు వసూలు చేశారని ఆరోపించారు. కేటాయించిన స్థలాల్లో రోడ్లు, డ్రెయిన్లు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. దళితుల శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించాల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బయ్యే మునీంద్ర, వెన్నపు సుధాకర్, ఏలూరి అశోక్‌కుమార్, సిర్రా రాజు, నల్లి రమేష్, చల్లాబత్తుల సత్యానారాయణ, గొల్ల ధనరాజు పాల్గొన్నారు.

### హిందీ నేర్చుకోవడం సులభం



వ్యాస రచన పోటీలో విజేతకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ జె.సునీత

కొవ్వూరు: హిందీ భాషా దినోత్సవాన్ని శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.సునీత తన ప్రసంగంలో హిందీ భాష గొప్పదనాన్ని వివరించారు. దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో ప్రజలు హిందీ మాట్లాడతారన్నారు. ఆ కళాశాల హిందీ విభాగాధిపతి కాంచనమాల మాట్లాడుతూ హిందీ నేర్చుకోవడం ఎంతో సులభం అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



ప్రకాష్‌రాజ్ (ఫైల్)

కంబాలచెరువు: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. స్థానిక ఆవ రోడ్డులోని విద్యానగర్‌కు చెందిన ప్రకాష్‌రాజ్ బైపాస్ రోడ్డులోని ఓ స్కూల్‌లో చదువుతున్నాడు. శుక్రవారం స్కూల్ నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా రామకృష్ణ థియేటర్ వద్దకు వచ్చేసరికి ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆ బాలుడిని దగ్గర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్, ఆ సంస్థ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో బాలుడి కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు.

### ముఖ్యమంత్రికి సాదర స్వాగతం







కాపు నేస్తం నాలుగో విడత నిధుల విడుదలకు శనివారం నిడదవోలు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) సాదర స్వాగతం పలికారు.

### ఆరోగ్య సురక్ష సర్వే పర్యవేక్షణ

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం గ్రామ సచివాలయం -1 పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, కఫం పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. సమస్యలు ఉన్నవారిని ఈనెల 30న తొలి వైద్య శిబిరానికి తరలించి వైద్య నిపుణల ఆధ్వర్యంలో చికిత్స అందిస్తారన్నారు. ఎస్.ఆశాజ్యోతి, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మురుగు తొలగింపునకు చర్యలు

తాళ్లపూడి: తాళ్లపూడి పంచాయతీ పరిధిలోని మాంటిస్సోరి హైస్కూల్ రోడ్డులోని డ్రెయిన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు పంచాయతీ కార్యదర్శి ఆశాలేఖ్య తెలిపారు. నటరాజ్ థియేటర్ ఎదురుగా ఉన్న బీసీ కాలనీకి వచ్చే రోడ్డుపై విద్యార్థులు, గ్రామస్తులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అండర్ గ్రౌండ్ డ్రెయిన్ నుంచి మురుగు నీరు రోడ్డు పైకి రావడంతో వారంతా రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలువురు స్పందనలో ఫిర్యాదు సైతం చేశఋూరు. శుక్రవారం కార్యదర్శి పూడికలు తొలగించడంతో పాటు, రోడ్డుపై వేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించారు. ఆమె వెంట సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.



తాళ్లపూడిలో మురుగు నీటిని పరిశీలిస్తున్న కార్యదర్శి

## వీధివీధినా గణనాథునికి పందిళ్లు

దేవరపల్లి: వినాయక చవితి ఉత్సవాలకు గణపతి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 18 నుంచి 27 వరకూ గణపతి నవరాత్ర మహోత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా గ్రామాల్లోని వినాయక ఆలయాలకు రంగులు వేసి, పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో వేసిన పందిళ్లలో మండపాలను నిర్మిస్తున్నారు. ప్రతిష్ఠించేందుకు 5 నుంచి 15 అడుగుల విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.5 వేల నుంచి 30 వేల రేటు పలుకుతోంది. దేవరపల్లిలో విగ్రహాల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. రాజస్థాన్‌కు చెందిన శిల్పులు ఆరు నెలలుగా విగ్రహాలను వివిధ మోడల్స్‌లో తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. ఇప్పటికే గ్రామాల్లో చవితి ఉత్సవాల సందడి ప్రారంభమైంది.

**మట్టి గణపతి ప్రతిమల పంపిణీ**

దేవరపల్లి: వినాయక చవితి సందర్భంగా దాతలు మట్టి గణనాథుని ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పూజల అనంతరం రంగులు వేసిన విగ్రహాలను చెరువులు, కాలువలు, నదుల్లో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణం కలుషితమవుతుంది. పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలనే పూజించాలన్న పర్యావరణ శాఖ సూచనల మేరకు మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్టు దేవరపల్లిలోని పెడసనగంటి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పెడసనగంటి సాయిబాబు తెలిపారు. శనివారం తన స్వగృహం వద్ద మట్టి ప్రతిమలను ఎంపీపీ కేవీకే దుర్గారావు చేతుల మీదుగా భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ 2013 నుంచి ఏటా వినాయక చవితి సందర్భంగా 500 నుంచి 600 మట్టి ప్రతిమలను తయారు చేయించి భక్తులకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ ప్రతిమల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కడిమి రాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తీగెల బలరామయ్య, పెడసనగంటి శశికాంత్‌శర్మ పాల్గొన్నారు.



దేవరపల్లిలో అమ్మకాలకు సిద్ధం చేసిన గణపతి విగ్రహాలు



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

### పోతవరంలో చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు

నల్లజర్ల: పోతవరం గ్రామంలో మందపాటి రాజేష్,రాజకుమారి దంపతులు తమ కుమారుడు దివంగత జాన్ ఆశిష్ పేరిట శనివారం చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ మేడిది జాన్సన్, బిషప్ ప్రేమ్‌కుమార్, సియోను కుమార్ పాల్గొన్నారు. ఏటా తమ కుమారుడి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. నెల్లూరు అనాథ శరణాలయంలోను, ఒంగోలులో వృద్ధుల ఆశ్రమంలోను అన్న, వస్త్రదాన కార్యక్రమాలు నిర్వహించారు.



### పవన్ కాపు జాతిని చంద్రబాబుకు తాకట్టు పెట్టాడు

గోపాలపురం నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు పెద్దిరెడ్డి ధ్వజం



పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్

ద్వారకాతిరుమల: జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాపు జాతిని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి తాకట్టు పెట్టాడని గోపాలపురం నియోజకవర్గ కాపు నాడు అధ్యక్షుడు పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్ అన్నారు. ప్రశ్నించేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్న పవన్, ప్రజాధనాన్ని దోచేసి సెంట్రల్ జైల్లో ఉన్న ఒక దొంగకు ఊడిగం చేస్తున్నాడని విమర్శించారు. కాపు యువతను అడ్డం పెట్టుకుని బాబుకు ఊడిగం చేయడం సిగ్గు చేటన్నారు. దివంగత కాపు నేత వంగవీటి రంగాను పొట్టన బెట్టుకోవడంతో పాటు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని ఎన్నో ఇబ్బందులకు గురి చేసి, కాపు జాతిని అణగదొక్కిన టీడీపీతో పవన్ పొత్తు పెట్టుకోవడం నీతిమాలిన చర్య అన్నారు. తన ప్యాకేజీ కోసం కాపు జాతిని చంద్రబాబు కాళ్ల దగ్గర పెట్టడం సరి కాదన్నారు. రాష్ట్రంలో కాపులంతా తన వెంట ఉన్నారనుకోవడం పవన్ అవివేకమన్నారు. టీడీపీతో పొత్తు అనగానే అత్యధిక శాతం కాపులు జగన్‌కు జై కొడుతున్నారని, ఈ దెబ్బతో పవన్ భవిష్యత్తు అంధకారం కావడం ఖాయమన్నారు.

### కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రకాశంనగర్: కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఉద్యమం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతు సంఘ రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. శనివారం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఈ సంఘ రాష్ట్ర సదస్సు జరిగింది. ముందుగా మొలకలు వచ్చిన కొబ్బరికాయలతో అంబేడ్కర్ భవనం నుంచి గోకవరం బస్టాండ్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొబ్బరి రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కొబ్బరి ఉత్పాదకతలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నా ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్లతో దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. రైతు సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కొబ్బరిని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని, ఒక్కో కాయకు కనీస ధర రూ.15 ఇవ్వాలన్నారు.

### తపాలా ఉద్యోగుల సమ్మె విజయవంతం చేయాలి

తాళ్లపూడి: తమ డిమాండ్ల సాధనకు అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు గ్రామీణ తపాలా ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం.రాధాకృష్ణ తెలిపారు. తాళ్లపూడి, మలకపల్లి, పోలవరం, దొందపూడి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి ఉద్యోగులను సమ్మెలో పాల్గొనాలని కోరారు. వచ్చే నెల 4న దేశ వ్యాప్తంగా జరిగే ఒక్క రోజు సమ్మెను విజయవంతం చేయాలన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారి సమీపంలోని పెట్రోలు బంక్ వద్ద పట్టణంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో చాగల్లు మండలంలోని చిక్కాల గ్రామానికి చెందిన సత్యనారాయణ, భవాని దంపతులు, వారి కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై చాగల్లుకు చెందిన భవాని సోదరుడు కాసాని శ్రీనివాసరావు కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యానారాయణ, భవాని దంపతులు తమ కుమారుడితో కలసి రాజమహేంద్రవరం ఆసుపత్రికి మోటార్ సైకిల్‌పై వెళుతూ మార్గ మధ్యలో ఈ ప్రమాదం బారిన పడినట్టు శ్రీనివాసరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన ముగ్గురిలో ఆ దంపతుల కుమారుడు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ దంపతులు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు కేసు నమోదు చేశారు.